# సాక్షి ఆదిలాబాద్

గురువారం । 11 । మే । 2023






**బాలాజీ గుట్టకు శోభాయాత్ర**

నార్నూర్‌లోని బాలాజీ గుట్టపై ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. విగ్రహ ప్రతిష్ఠాపన కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. బుధవారం శోభాయాత్ర చేపట్టారు. 9లో▸



**ఉత్తుత్తి శిక్షణ**

వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఆయా క్రీడల్లో మెలకువలు నేర్పేందుకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాలు జిల్లాలో ఉత్తుత్తిగా మారాయి. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం 42.0/26.0

**వాతావరణం**

ఆకాశం పలుచోట్ల పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది.

## న్యూస్‌రీల్

### యువత అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావు

**నేరడిగొండ:** యువత క్రీడలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నేరడిగొండ ప్రీమియర్ లీగ్ (ఎన్‌పీఎల్) క్రికెట్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఎంపీపీ రాథోడ్ సజన్, తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, కాంగ్రెస్ నాయకుడు గజేందర్, స్థానిక సర్పంచ్ పెంట వెంకటరమణ, ఉపసర్పంచ్ దేవేందర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### ప్రశాంతంగా ఎంసెట్

**ఆదిలాబాద్‌టౌన్:** అగ్రికల్చర్ బీఎస్సీలో ప్రవేశం కోసం బుధవారం నిర్వహించిన ఎంసెట్ ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని నలంద డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నిమిషం నిబంధన ఉండడంతో విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగిన పరీక్షకు 99 మందికి గాను 96 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు వంద మందికి గాను 96 మంది హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ పున్నరావు తెలిపారు.

### జేపీఎస్‌లను తొలగిస్తామనడం సరికాదు



జేపీఎస్‌లకు మద్దతు తెలుపుతున్న తుడుందెబ్బ నాయకులు

**కైలాస్‌నగర్:** విధుల్లో చేరకుంటే జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ఉద్యోగాల నుంచి తొలగిస్తామనే ప్రభుత్వ నిర్ణయం సరికాదని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ అన్నారు. తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో జేపీఎస్‌లు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె బుధవారం 13వ రోజుకు చేరింది. వీరికి తుడుందెబ్బ నాయకులు మద్దతు తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించమని కోరిన జేపీఎస్‌లపై సీఎం కేసీఆర్ మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు కుమ్ర శ్యాంరావు, ఉయిక సంజీవ్, రేణుక, జేపీఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

### ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



శాంతినగర్‌లో పర్యటిస్తున్న ట్రైనీ కలెక్టర్ శ్రీజ

**తాంసి:** ఐటీడీఏ నిధులతో పీవీటీజీలో భాగంగా కొలాం గిరిజనుల కోసం నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ట్రైనీ కలెక్టర్ శ్రీజ అధికారులను ఆదేశించారు. భీంపూర్ మండలంలోని శాంతినగర్‌లో నూతన ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పనులు నాణ్యతతో చేపడుతూ గడువులోగా పూర్తి చేయాలన్నారు. వారి వెంట ఐటీడీఏ డీఈ సంతోష్, పీటీడీఏ అధ్యక్షుడు దీలీప్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

**కోట్పా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి**

**ఆదిలాబాద్‌టౌన్:** జిల్లాలో కోట్పా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ట్రైనీ కలెక్టర్ శ్రీజ అన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా బీబీనగర్ ఎయిమ్స్, జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ధూమపానంతో ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. మే 31న నో టొబాకో డేగా ప్రకటిస్తూ ప్రతి కార్యాలయాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ముందుగా పొగాకు ద్వారా జరిగే నష్టాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, డీఎస్పీ ఉమేందర్, బీబీనగర్ ఎయిమ్స్ వైద్యులు శ్రావణ్, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారిశ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం

# పది డౌన్..!

- గతేడాదితో పోల్చితే తగ్గిన ఉత్తీర్ణత
- జిల్లాలో ఈ సారి 88.68 శాతమే..
- రాష్ట్రస్థాయిలో 19వ స్థానం

జిల్లాలో పదో తరగతి ఫలితాలు..

| | |
|---|---|
| పరీక్షకు హాజరైన విద్యార్థులు | 10,562 |
| ఉత్తీర్ణులైన వారు | 9,366 |
| బాలుర ఉత్తీర్ణత శాతం | 88.0 |
| బాలికల ఉత్తీర్ణత శాతం | 89.35 |

**10 జీపీఏ సాధించిన పాఠశాలలు..**

జిల్లాలో మొత్తం 34 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. ఇందులో బోథ్ మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు, ఆదిలాబాద్ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఒకరు, ఆదిలాబాద్‌రూరల్ మండలం పొచ్చర పాఠశాలలో ఒకరు, తాంసి మండలం కప్పర్లలో ఒకరు, ఆదిలాబాద్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఒకరు, అలాగే ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 27 మంది ఉన్నారు.



కేమ కరణ్ (10 జీపీఏ), జెడ్పీఎస్ఎస్ కప్పర్ల



గడిచెర్ల రోషిని (10 జీపీఏ), జెడ్పీఎస్ఎస్, పొచ్చర

**ఆదిలాబాద్‌టౌన్:** పదో తరగతి ఫలితాల్లో జిల్లా వెనుకబడింది. గతేడాదితో పోల్చితే ఈసారి ఉత్తీర్ణత శాతం తగ్గింది. గతేడాది 95.34 శాతం నమోదు కాగా ఈసారి 88.68 శాతానికే పరిమితమైంది. రాష్ట్ర స్థాయిలో 9 నుంచి 19వ స్థానానికి పడిపోయింది. బాలురతో పోల్చితే బాలికలు పైచేయి సాధించారు. మరోవైపు జిల్లాలో 78 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించగా.. 34మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. ప్రైవేటుకు ధీటుగా సర్కారు బడుల్లో చదివిన విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

**తగ్గిన ఉత్తీర్ణత శాతం**

పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ఈఏడాది నిరుత్సాహ పర్చారు. గతేడాదితో పోల్చితే 6.66 శాతం ఉత్తీర్ణత తగ్గింది. జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలల పరంగా చూస్తే ఆశ్రమ పాఠశాలల్లో 81.38 శాతం, బీసీ వెల్ఫేర్‌లో 98.2 శాతం, ప్రభుత్వ యాజమాన్యాల్లో 68.12 శాతం, కేజీబీవీల్లో 85.48 శాతం, మోడల్ స్కూల్‌లో 98.77 శాతం, ప్రైవేట్ పాఠశాలల్లో 94.13 శాతం, మైనార్టీ రెసిడెన్షియల్‌లు 94.5 శాతం, సాంఘిక సంక్షేమ గురుకులాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌లో 95.2 శాతం, జెడ్పీ పాఠశాలల్లో 88.3 శాతం ఉత్తీర్ణులయ్యారు. అధికారుల పర్యవేక్షణ లోపించడం, ప్రత్యేక తరగతుల నిర్వహణ సరిగా లేకనే ఫలితాల్లో వెనుకబడినట్లు తెలుస్తోంది. పాఠ్య పుస్తకాలు సైతం ఆలస్యంగా పాఠశాలలకు చేరుకోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. పలు సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయుల కొరత ఫలితాలపై ప్రభావం చూపిందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

**వందశాతం ఉత్తీర్ణత పాఠశాలలు ఇవే..**

జిల్లాలో వందశాతం ఉత్తీర్ణతను 78 పాఠశాలలు కైవసం చేసుకున్నాయి. ఇందులో 10 ఆశ్రమ పాఠశాలలు, 2 బీసీ వెల్ఫేర్, ఒక ప్రభుత్వ పాఠశాల, నాలుగు కేజీబీవీలు, మూడు మోడల్ స్కూల్స్, 21 ప్రైవేట్, రెండు మైనార్టీ రెసిడెన్షియల్, మూడు సోషల్ వెల్ఫేర్, రెండు ట్రైబల్ వెల్ఫేర్, 30 జెడ్పీ పాఠశాలలు ఉన్నాయి.

**ఉత్తీర్ణత ఈసారి కొంత తగ్గింది**

జిల్లాలో పదో తరగతి ఉ త్తీర్ణత శాతం ఈ ఏడాది కొంత తగ్గింది. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల వి ద్యార్థులకు మాత్రం మంచి ఫలితాలు దక్కాయి. వచ్చే విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తాం. మొదటి నుంచే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతాం. – ప్రణీత, డీఈవో

**జూన్ 14 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ**

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 14 నుంచి 22 వరకు జరగనున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఫలితాలు వెలువడిన 15 రోజుల వరకు రీకౌంటింగ్ కోసం సబ్జెక్టుకు రూ.500 చొప్పున ఎస్‌బీఐ ద్వారా చలానా రూపంలో చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. రీవెరిఫికేషన్ కోసం సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున చలానా తీయాల్సి ఉంటుంది. సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువు ఈనెల 26 వరకు ఉంది.

# అనర్హులకే..‘లక్కీ’!

- ఆదిలాబాద్ పట్టణంలోని 28వ వార్డుకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి, ఓ శాఖలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రతినెలా ప్రభుత్వం నుంచి వేతనం పొందుతున్నాడు. అలాంటి వ్యక్తి భార్య పేరిట డబుల్ బెడ్ రూం కేటాయించారు.
- స్థానిక 35వ వార్డు మహిళా కౌన్సిలర్‌కు శాంతినగర్‌లో సొంత ఇల్లు ఉంది. ఆమె భర్త కాంట్రాక్టర్. మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ఆయన అభివృద్ధి పనులు చేస్తున్నారు. అయినా ఆమెకు లక్కీ డ్రాలో డబుల్ బెడ్ రూం కేటాయించారు.
- 33వ వార్డులోని అధికార పార్టీకి చెందిన మైనార్టీ యువ నాయకుడికి శాంతినగర్‌లో రూ.కోట్ల విలువ చేసే సొంతిల్లు ఉంది. రెండు ద్విచక్ర వాహనాలూ ఉన్నాయి. అయినా ఆయన్ను పేదవాడిగా పేర్కొంటూ డబుల్ బెడ్ రూం కేటాయించారు.

వీరే కాదు.. మరికొంత మంది ఇలా మున్సిపల్ పరిధిలో ఎంపిక చేసిన డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల జాబితాలో ‘లక్కీ’గా చోటు దక్కించుకోవడం గమనార్హం.



మంగళవారం నిర్వహించిన లక్కీడ్రాలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్ తదితరులు

- అర్హులను వరించని అదృష్టం
- ‘డబుల్’ ఎంపికలో అక్రమాలు?
- అధికారుల తీరుపై అనుమానాలు
- మొక్కుబడి విచారణే కారణమని ఆరోపణలు

**కైలాస్‌నగర్:** సొంతిల్లే కాదు.. ద్విచక్ర వాహనం ఉన్నా డబుల్ బెడ్‌రూం పథకానికి అనర్హులే.. ఇది మొన్నటివరకు ఆదిలాబాద్ అర్బన్ రెవెన్యూ అధికారులు చెప్పిన మాట. అయితే మంగళవారం నిర్వహించిన ఇళ్ల కేటాయింపు లక్కీడ్రాలో ద్విచక్ర వాహనం ఒక్కటే కాదు.. రూ.కోట్ల విలువైన సొంతిల్లు, ప్రభుత్వ ఉద్యోగం, ఐటీ చెల్లింపులు చేస్తున్న వారు సైతం ఎంపికవడం గమనార్హం. అయితే అర్హులను వదిలి అనర్హులకు కేటాయించడం అనుమానాలకు తావిస్తోంది. ఇందులో తెర వెనుక భారీగా ముడుపులు చేతులు మారినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఏం జరిగిందంటే..**

ఆదిలాబాద్ అర్బన్ మండల పరిధిలోకి వచ్చే మున్సిపల్ పరిధిలోని 32 వార్డులకు చెందిన నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందు కోసం 7,902 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 2,538 మందిని అర్హులుగా గుర్తించి లక్కీడ్రా కోసం ఎంపిక చేశారు. 618 ఇళ్ల కేటాయింపు కోసం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో కలెక్టర్ ఆధ్వర్యంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా మంగళవారం లక్కీ డ్రా నిర్వహించారు. అయితే ఇందులో పలువురు అనర్హులైన వారిని ఎంపిక చేయడం అనుమానాలకు తావిస్తోంది. ద్విచక్రవాహనం ఉన్నా సరే అనర్హులని ప్రకటించిన అధికారులు, అలాంటి వారి పేర్లను అర్హుల జాబితాలో చేర్చడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ జోక్యంతోనే ఇలా చేశారా లేక ఉద్దేశపూర్వకంగానే అనర్హులకు చోటు కల్పించారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**మొక్కుబడి విచారణే కారణం..**

పేదలకు సొంతిల్లు ఒక కల. దాన్ని సాకారం చేసుకునేందుకు జీవితాంతం ఎంతో కష్టపడుతారు. అయితే ప్రభుత్వం అర్హులైన వారికి ఉచితంగా డబుల్ బెడ్ రూమ్ ఇస్తామని ప్రకటించడంతో వారంతా సంతోషపడ్డారు. తమ కష్టాలు దూరమవుతాయని భావించారు. ఇంటి కోసం దరఖాస్తు చేసుకొని తమకు కచ్చితంగా దక్కుతుందని ఆశపడ్డారు. అయితే ఇలాంటి వారికి లక్కీడ్రాలో నిరాశే ఎదురైంది. దీనికి క్షేత్రస్థాయిలో సరైన విచారణ చేపట్టకపోవడమే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. అర్హుల గుర్తింపు కోసం రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో విచారణ జరిపించాల్సి ఉంది. అయితే తమ బాధ్యతలు తప్పించుకునేందుకు మున్సిపల్, మెప్మా రిసోర్స్ పర్సన్లకు అర్హుల ఎంపిక బాధ్యతలు అప్పగించారు. వారు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా కేవలం కౌన్సిలర్లను సంప్రదించి వారు చెప్పినట్టుగా వివరాలు నమోదు చేసుకొని అదే జాబితాను రెవెన్యూకు పంపించారు. ఫలితంగా అర్హులకు దక్కాల్సిన ఇళ్లు అనర్హుల చేతుల్లోకి వెళ్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. వచ్చే వారంలో నిర్వహించనున్న మరో లక్కీడ్రా ప్రక్రియలోనైనా ఇలా జరగకుండా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

**‘డబుల్ కేటాయింపులో అర్హులకు అన్యాయం’**

**ఆదిలాబాద్:** డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో అర్హులకు అన్యాయం జరిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బుధవారం విలేకులతో మాట్లాడారు. లక్కీడ్రా ద్వారా చేపట్టిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. అర్హులను కాకుండా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, అధికార పార్టీ నాయకుల బంధువులు, ఇన్‌కమ్ ట్యాక్స్ కడుతున్న వారిని ఎంపిక చేశారని పేర్కొన్నారు. మైనార్టీల్లో కేవలం ఒక్క వర్గానికే ప్రాధాన్యత ఇచ్చి, మిగతా వారిని విస్మరించారన్నారు. జనాభాలో 52 శాతంగా ఉన్న బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. అర్హులకు ఇళ్లు కేటాయించే వరకు బీజేపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు లాలామున్నా, దయాకర్ పాల్గొన్నారు.

**అలాంటివి నా దృష్టికి రాలేదు**

లక్కీడ్రాను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాం. అనర్హులకు ఇళ్లు దక్కినట్లు ఇప్పటివరకు నా దృష్టికి రాలేదు. ఒకవేళ అలా ఎంపికై ఉంటే వాటిపై ఫిర్యాదు చేయవచ్చు. క్షేత్రస్థాయిలో విచారించి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. అక్రమాలు జరిగాయనడంలో ఎలాంటి వాస్తవం లేదు.
– సతీశ్‌కుమార్, తహసీల్దార్, ఆదిలాబాద్‌అర్బన్

## ఓటరు జాబితా తయారీకి సహకరించాలి

- అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నటరాజ్

**కైలాస్‌నగర్:** పొరపాట్లకు తావులేని ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా ఎన్నికల సంఘం మూడు నెలలకోసారి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. ఫారం-6 ద్వారా నూతన ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులు నూతన ఓటర్ల నమోదుకు సహకారం అందించాలని కోరారు. అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ఒకే చిరునామా, ఒకే పేరుతో ఉన్న 165 మంది ఓటర్లను తొలగించామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించిన ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా పోలింగ్ బూత్, చిరునామా వంటి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. సమావేశంలో ఆర్డీవో రమేశ్ రాథోడ్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియ, సాంకేతిక సిబ్బంది ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇలా వచ్చారు.. అలా వెళ్లారు

- డీడబ్ల్యూవోగా సుభద్ర బాధ్యతలు స్వీకరణ
- ఆ వెంటనే మూడు నెలల పాటు సెలవులో..
- జిల్లాలో మళ్లీ ఇన్‌చార్జి పాలనే!



కొత్త డీడబ్ల్యూవో సుభద్రకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, చిత్రంలో పాత డీడబ్ల్యూవో మిల్కా

**సాక్షి,ఆదిలాబాద్:** మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన సి.సుభద్ర ఇలా వచ్చి.. అలా వెళ్లారు. సాయంత్రం సమయంలో కార్యాలయానికి వచ్చి సంతకం పెట్టి కుర్చీపై ఆసీనురాలైన ఆమె పట్టుమని ఒక్కరోజు కూడా సరిగ్గా ఉండకుండా మూడు నెలల పాటు సెలవు పెట్టేశారు. తన సెలవుపత్రాన్ని శాఖ కమిషనరేట్ కార్యాలయానికి పంపించారు. ఇక ఇన్‌చార్జిగా సీనియర్ సీడీపీవోకు బాధ్యతలు అప్పగిస్తారా.. లేనిపక్షంలో ఎలా ఉంటుందనేది త్వరలో తేలనుంది.

**పదోన్నతి కోసమే బాధ్యతల స్వీకరణ..?**

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 4న రాష్ట్రంలోని మహిళా శిశు సంక్షేమ శాఖలో బాధ్యతలు నిర్వహిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి ఎనిమిది మంది అధికారులకు పదోన్నతి కల్పించి డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) హోదా కల్పించారు. ఆయా జిల్లాలకు వారిని డీడబ్ల్యూవోలుగా నియమించారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్‌కు సుభద్రను కేటాయించారు. నల్గొండలో డీడబ్ల్యూవోగా వ్యవహరిస్తున్న ఆమె డీడీ పదోన్నతి కోసమే ఆదిలాబాద్‌లో నామమాత్రంగా బాధ్యతలు తీసుకొని ఆపై సెలవుల్లో వెళ్లారనే ప్రచారం శాఖలోనే జరుగుతుంది. వ్యక్తిగత కారణాలతో మూడు నెలల పాటు సెలవు తీసుకున్న ఆమె ఈ కాలంలో డిప్యూటేషన్‌పై మళ్లీ యథాస్థానానికి వెళ్తారా.. లేనిపక్షంలో ఎలా ఉంటుందోననేది తెలుస్తుంది.

**మళ్లీ కథ మొదటికే..**

ఇప్పటివరకు ఆదిలాబాద్ డీడబ్ల్యూవోగా సీడీపీవో స్థాయి అధికారి వ్యవహరించారు. తాజాగా ప్రభుత్వం డీడీ పదోన్నతులు కల్పించి కొంతమందిని రెగ్యులర్ అధికారులుగా వేర్వేరు జిల్లాలకు నియమించారు. ఆదిలాబాద్‌కు ఎన్నో ఏళ్ల తర్వాత ఒక రెగ్యులర్ ఉన్నత అధికారి వస్తున్నారన్న ఆనందం కొద్ది రోజులు కూడా నిలవలేదు. మళ్లీ ఇన్‌చార్జి పాలనే దిక్కు కానుంది. ప్రధానంగా అంగన్‌వాడీల నిర్వహణ, నియామకాలు, అనుబంధ పౌష్టికాహార పంపిణీ జిల్లాలో సరైన రీతిలో జరగడం లేదన్న విమర్శలు ఏళ్లుగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో రెగ్యులర్ అధికారి బాధ్యతలు స్వీకరిస్తే పరిస్థితిలో మార్పు వస్తుందా.. అని భావించారు. అయితే కథ మళ్లీ మొదటికి వచ్చింది.

**పైరవీకే పెద్దపీటనా.. సీనియార్టీకి అందలమా**

మహిళా శిశు సంక్షేమ శాఖలో డీడబ్ల్యూవో పోస్టులో అధికారిని నియమించే విషయంలో మళ్లీ పైరవీకే పెద్దపీట వేస్తారా.. లేనిపక్షంలో సీనియార్టీకి అందలం కల్పిస్తారా అనేది వేచి చూడాల్సిందే. ఇదివరకు డీడబ్ల్యూవోగా వ్యవహరించిన మిల్కా కంటే సీనియర్లు ఉన్నా ఆమెను అధికారిగా నియమించారనే ప్రచారం ఉంది. అలాగే జిల్లాలోని ఏ ప్రాజెక్టులో ఆమెకు సీడీపీవో పోస్టు లేకపోయినా ఇక్కడ డీడబ్ల్యూవోగా ఎలా వ్యవహరిస్తారనే అపవాదు కూడా వ్యక్తమైంది. జిల్లాలో ఐదు ప్రాజెక్టులు ఉన్నాయి. ఆదిలాబాద్‌అర్బన్‌కు వనజ, జైనథ్‌కు నర్సమ్మ, బోథ్‌కు సౌందర్య, ఉట్నూర్‌కు వినూత్న, నార్నూర్‌కు శారదలు సీడీపీఓలుగా వ్యవహరిస్తున్నారు. ఇందులో వనజ సీనియర్ అధికారి అని శాఖలో చెబుతున్నారు. మరి ఆమెకే డీడబ్ల్యూవో ఇన్‌చార్జి పదవి దక్కుతుందా.. లేదా అనేది వేచిచూడాల్సిందే.

**మరో శాఖలో పెద్ద కుర్చీ కోసం యత్నాలు..?**

ఆదిలాబాద్‌కు డీడబ్ల్యూవోగా సుభద్రను నియమిస్తూ ఇన్‌చార్జిగా ఉన్న మిల్కాను కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఇదిలా ఉంటే ఆ అధికారి జిల్లాలోనే ఓ ముఖ్య శాఖలో పెద్ద కుర్చీలో కూర్చునేందుకు రాజకీయ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అది ఓ కొలిక్కి వచ్చిందనే ప్రచారం సైతం ఉంది. తాజాగా రెగ్యులర్ అధికారి సుభద్ర సెలవులో వెళ్లడంతో మళ్లీ ఆమె ఈ పోస్టు కోసంయత్నిస్తారా.. లేనిపక్షంలో వేరే శాఖలో ఆ పెద్ద కుర్చీ కోసమే ముందుకెళ్తారా అనేది చూడాల్సిందే.

**వ్యక్తిగత కారణాలతోనే సెలవులో..**

ఆదిలాబాద్ డీడబ్ల్యూవోగా బాధ్యతలు స్వీకరించినప్పటికీ కుటుంబ, వ్యక్తిగత కారణాలతో మూడు నెలల పాటు సెలవు తీసుకుంటున్నాను. చార్జ్ తీసుకున్న తర్వాత సెలవు పత్రాన్ని కమిషనరేట్ కార్యాలయానికి పంపించాను. ఇక్కడ ఎవరిని ఇన్‌చార్జిగా నియమిస్తారనేది అక్కడి నుంచే ఆదేశాలు వస్తాయి. – సి.సుభద్ర, డీడబ్ల్యూవో

### మామిడిగూడలో పెర్సపేన్ పూజలు



**బోథ్:** మండలంలోని మామిడిగూడలో ఆదివాసీలు బుధవారం సంప్రదాయబద్ధంగా పెర్సపేన్ పూజలు నిర్వహించారు. అనంతరం ఇచ్చోడలోని బాంబ వద్ద ప్రత్యేక పూజలకు తరలివెళ్లారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**ఆదిలాబాద్‌రూరల్:** బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ ఆధ్వర్యంలో గురుకుల ఉపాధ్యాయ ఉద్యోగాల శిక్షణకు గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈనెల 12 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ కాలంలో స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులు జూన్ 1 నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## క్లుప్తంగా

### మత్తడివాగులో దూకి యువకుడి ఆత్మహత్య


అక్షయ్ (ఫైల్)

తాంసి: తల్లిదండ్రులు మందలించారని మత్తడి వాగులో దూకి యువకుడు ఆత్మహత్యకు పాలప్పడిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... వడ్డాడి గ్రామానికి చెందిన ఇప్ప అక్షయ్(20) జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పారా మెడికల్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని రోజులుగా కళాశాలకు వెళ్లకుండా మద్యానికి బానిసై తిరుగుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తల్లిదండ్రులు మద్యం మానేయాలని మందలించారు. దీంతో అదే రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గ్రామ సమీపంలోని మత్తడివాగు ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం ప్రాజెక్టులో మృతదేహాన్ని గుర్తించిన గంగాపుత్రులు గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు.

### ఉరేసుకుని యువతి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రణదీవేనగర్‌కు చెందిన శిరీష(20) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... శిరీష డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. చదువుకోకుండా పదే పదే టీవీ చూడడంతో తండ్రి గంగన్న మందలించాడు. మనస్తాపంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### 'బోడగుట్ట' ఘటనలో ఎనిమిది మందిపై కేసు

భైంసాటౌన్: భైంసాలోని బోడగుట్టపై ఇటీవల హనుమాన్ విగ్రహం వెలుగు చూసిన ఘటనలో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎల్.శ్రీను బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. భైంసా మండలం బిజ్జూర్ గ్రామానికి చెందిన బద్దం భోజారెడ్డి అనే వ్యక్తి తన వద్ద పనిచేసే కళ్యాణ్ పాండురంగ, వేణుగోపాల్, ఆనంద్, జాదవ్ సతీష్, యోగేశ్, సూదుల సాయినాథ్, కాసరం సంతోష్ సాయంతో గుట్టపైకి హనుమాన్ విగ్రహం తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. రాజకీయంగా లబ్ధి కోసమే కలలో దేవుడు కనిపించాడంటూ ప్రజలను తప్పుదోవ పట్టించాడని తెలిపారు. ఈ మేరకు పైన పేర్కొన్నవారికి నోటీసులు అందించినట్లు వెల్లడించారు. పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

### టేకు చెట్లు నరికిన నలుగురిపై కేసు

పెంబి: పెంబి రేంజ్ పరిధిలోని తాటిగూడ సెక్షన్, పుల్లంపాండ్రిలో గుండాల గ్రామానికి చెందిన షేక్ మసుద్, షేక్ ఖాజీం, అశోక్, ప్రశాంత్ అనే నలుగురు పది రోజుల క్రితం దాదాపుగా 22 చెట్లు అక్కడే ఉన్న బేస్ క్యాంపు సిబ్బంది సహాయంతో నరికారు. అధికారులు బేస్ క్యాంపు సిబ్బందిని విచారించగా గుండాల గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు నరికినట్లు తెలిపారు. దీంతో నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్‌వో రామకృష్ణ తెలిపారు. నరికిన టేకు చెట్ల విలువ రూ.3లక్షల 36వేలు ఉంటుందన్నారు. ఇందులో ఫారెస్ట్ సిబ్బంది ఉన్నారు.

### ఇసుక క్వారీ తనిఖీ

చెన్నూర్: పట్టణంలోని గోదావరినదిలో ఉన్న సింగరేణి ఇసుక క్వారీని బుధవారం సింగరేణి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ హనుమంతరావు తనిఖీ చేశారు. క్వారీలో ఇసుక లిఫ్టింగ్ ప్రదేశాలు, సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు.



ఇక్కడ ఖాళీగా దర్శనమిస్తున్న వాలీబాల్ కోర్టు మావల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనిది. జిల్లా యువజన క్రీడల శాఖ ఇక్కడ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించేలా ఓ క్రీడా శిక్షకుడికి అనుమతినిచ్చింది. అయితే సదరు శిక్షకుడు, క్రీడాకారులు కానీ కనిపించని వైనం. మే 1 నుంచి 31వ తేదీ వరకు శిక్షణ ఇవ్వాల్సి ఉండగా నేటికీ ఈ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించకపోవడం అధికా రుల అలసత్వాన్ని స్పష్టం చేస్తుంది.



ఈ చిత్రంలో తాళం వేసి కనిపిస్తున్నది ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని అంకోలి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల. ఇక్కడ వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో భాగంగా కబడ్డీ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఏర్పాటు చేసినప్పటికీ క్రమం తప్పకుండా శిక్షణ నిర్వహించడం లేదు. ఉదయం, సాయంత్రం శిక్షణ ఇవ్వాల్సి ఉండగా ఉదయం మాత్రమే శిక్షణ ఇచ్చి మమ అనిపిస్తున్నారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోనే ఉన్నా అధికారుల పర్యవేక్షణ కొరవడిందనేదానికి ఈ చిత్రమే నిదర్శనం.



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలోని బ్యాడ్మింటన్ కోర్టు ఇది. వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని కేటాయించినప్పటికీ శిక్షకుడు రాక చిన్నారులు సైతం శిక్షణ కోసం రావడం లేదు. శిక్షకుడు క్రమం తప్పకుండా వస్తే మరిన్ని మెలకువలు నేర్చుకుని మంచి క్రీడాకారులుగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని చిన్నారుల తల్లిదండ్రులు చెబుతున్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి కూతవేటు దూరంలోనే బ్యాడ్మింటన్ సమ్మర్ క్యాంప్ దుస్థితి ఇది.

# ఉత్తుత్తి శిక్షణ

- వేసవి క్రీడా శిక్షణ శిబిరాలపై అలసత్వం
- తూతూ మంత్రంగా నిర్వహిస్తున్న వైనం
- శిబిరాల నిర్వహణపై పర్యవేక్షణ కరువు

ఆదిలాబాద్: వేసవి సెలవుల్లో విద్యార్థులు తమ సమయాన్ని వృథా చేసుకోకుండా క్రీడా మెలకువలను నేర్చుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఏడాది నెల రోజుల పాటు క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. 14ఏళ్ల లోపు బాల, బాలికలు మానసికంగా శారీరకంగా దృఢంగా మారడంతో పాటు క్రీడలపై వారు ఆసక్తిని పెంచుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎదగాలనే లక్ష్యంతో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పలు క్రీడాంశాల్లో క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 16, పట్టణ ప్రాంతంలో 5 శిబిరాలు ఏర్పాటుకు అనుమతించారు. మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఈ సమ్మర్ క్యాంపులు నిర్వహించాల్సి ఉండగా, చాలా చోట్ల ప్రారంభించకపోవడం గమనార్హం.

**తూతూ మంత్రంగా ప్రారంభించి..**

కరోనా కన్నా ముందు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తే చిన్నారులు పెద్ద ఎత్తున తరలివచ్చేవారు. ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లోనే ఎంతో ఆసక్తిగా క్రీడల్లో సామర్థ్యాలను పెంపొందించుకొని జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా ఎదిగిన వారు సైతం ఉన్నారు. ఈ దిశగా అనేక ప్రచార కార్యక్రమాలను చేపట్టేవారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. నామమాత్రంగా ప్రకటనలు విడుదల చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. అడిషనల్ కలెక్టర్ చేతుల మీదుగా శిక్షకులకు క్రీడా పరికరాలను పంపిణీ చేసిన అధికారులు, శిక్షణ శిబిరం ప్రారంభ కార్యక్రమాన్ని నామమాత్రంగా నిర్వహిస్తున్నారు.

**పర్యవేక్షణకు రారు.. పట్టించుకోరు..**

జిల్లాలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు ప్రభుత్వం రూ.1.05 లక్షల నిధులు కేటాయించింది. ఇందులో క్రీడా పరికరాల కొనుగోలుకు రూ.50 వేలు ఖర్చు చేయగా, ఒక్కో శిక్షకునికి రూ.4 వేల చొప్పున అందజేయనున్నారు. అదేవిధంగా ప్రాథమిక చికిత్స అందించడానికి మెడికల్ కిట్ కోసం రూ.5 వేలు, రూ.10 వేలు ఖర్చు చేయనున్నారు. క్యాంపుల కోసం ప్రభుత్వం నిధులను కేటాయించినా క్షేత్రస్థాయిలో ఈ దిశగా నడవడం లేదు. శిబిరాలు పలుచోట్ల కాగితాలకే పరిమితమవుతున్నాయి. పలుచోట్ల శిబిరాలు ప్రారంభించలేదు.


జిల్లా కేంద్రంలోని ఐపీ స్టేడియంలో చిరిగిపోయిన నెట్ వద్దే వాలీబాల్ ఆడుతున్న చిన్నారులు

### సంఖ్య పెంచినా ఫలితం శూన్యమే..

క్రీడలకు పెట్టింది పేరైన జిల్లాలో వేసవి వస్తే చాలు పల్లె ప్రాంతాల్లో పదుల సంఖ్యలో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసేవారు. కరోనా అనంతరం క్యాంపులు లేకపోవడం, చిన్నారులు రాకపోవడం శిక్షకులు సైతం అనాసక్తి ప్రదర్శించడంతో శిబిరాల ఏర్పాటు వీలు కాలేదు. కరోనా అనంతరం జిల్లాలో 10 వరకు క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయాలని సాట్స్ నిర్ణయించింది. ఆదిలాబాద్ జిల్లాలో ఇందుకు భిన్నంగా 21 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభించాలని నిర్ణయించారు. వాలీబాల్ క్రీడకే 4 క్యాంపులు కేటాయించగా హాకీ క్రీడకు మూడు క్యాంపులను కేటాయించారు. ఇందులో ఎంతో ఆసక్తితో క్రీడా శిక్షణ ఇద్దామని ముందుకు వచ్చిన వారికి అవకాశాలు లభించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నెల 17వ తేదీ నుంచి మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించనుండగా ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో తర్ఫీదు పొందిన వారు పతకాలను సాధించి రాష్ట్ర స్థాయి వరకు వెళ్లే అవకాశం ఉండేది.

### శిక్షకుడు ఉంటే బాగుంటుంది



హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాను. అక్కడ మా స్కూల్లో అన్ని ఆటలు ఆడిస్తారు. మాకు ఏ ఆటలో ఆసక్తి ఉందో ఆ ఆటలో ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. వేసవి సెలవుల్లో ఇంటికి వచ్చాను. మా పాఠశాల స్నేహితులం అంతా కలిసి రోజూ ప్రాక్టీస్ చేస్తున్నాం. అయితే మాలాంటి వాళ్ళకు ఒక శిక్షకుడు ఉంటే బాగుంటుంది.
– ప్రియాష, అశోక్ రోడ్, ఆదిలాబాద్

### సౌకర్యాలు కల్పించాలి



ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సౌకర్యాలు కల్పించాలి. ఇక్కడ స్టేడియంలో వాలీబాల్ శిక్షణ ఇవ్వడం లేదు. హాకీ వంటి వాటికి మాత్రమే శిక్షణ ఇస్తున్నారు. వాలీబాల్ కోర్టు సరిగ్గా లేదు. నెట్ లేదు. మేం బాల్ కూడా ఇంటి నుంచి తీసుకువచ్చి ఆడుకుంటున్నాం. తాగడానికి మంచి నీరు కూడా ఉండడం లేదు.
–శ్రీకాంత్, శాంతినగర్, ఆదిలాబాద్

### వీధి కుక్కల దాడిలో యువతికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతి

పెంబి: మండలంలోని తాటిగూడ గ్రామానికి చెందిన యువతి ఇంటి నుంచి బటయకు వస్తున్న క్రమంలో ఒక్కసారిగా వీధి కుక్క దాడిలో యువతి చేతికి గాయాలయ్యారు. అక్కడే స్థానికులు కుక్కను తరిమేసి యువతిని పెంబి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలి

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి కాలనీల కు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని బీజే పీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు అన్నా రు. బుధవారం సీతారాంపల్లిలోని ఫిల్టర్‌బెడ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిల్టర్ బెడ్ పని చేయక నాలుగు నెలలు కావస్తున్నా సింగరేణి యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ఫిల్టర్‌కాని నీరు తాగి ఈ ప్రాంత ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అగల్ డ్యూటీ రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రంగారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఈర్ల సదానందం, నాయకులు మిట్టపల్లి మొగిలి, అడిచెర్ల రూపాదేవి, తిప్పని భీమయ్య, రావుల లక్ష్మణ్, కొంతం మహేందర్, తరాల విజయ్, నారగోని సతీశ్, రాజు పాల్గొన్నారు.

### మద్యం మత్తులో ఒకరి ఆత్మహత్య

ఆసిఫాబాద్: మద్యం మత్తులో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. మండలంలోని చిలాటిగూడకు చెందిన చౌదరి ఏమాజి (28) హమాలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిస కావడంతో ఇంట్లో తరచూ గొడవపడుతుండేవాడు. మంగళవారం సాయంత్రం మద్యం మత్తులో ఇంట్లోని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించగా పరిస్థితి విషమించడంతో రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య శారద ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# పంట మార్పిడితో లాభాలు


నాగరాజు, ఏవో


హార్వెస్టర్ ద్వారా వరి కోత

నిర్మల్‌చైన్‌గేట్: ఒకే పంటను భూమిలో ఏళ్ల తరబడిగా పండిస్తే సమస్యలు ఎదురవుతాయి. చీడపీడల తాకిడి అధికమవుతుంది. భూమి సైతం నిస్సారంగా మారుతుంది. పంట మార్పిడి ద్వారా ఈ సమస్యను అధికమించవచ్చని ఏవో నాగరాజు సూచిస్తున్నారు. వేర్వేరు పంటలు సాగు చేస్తే రైతులకు దిగుబడి పెరగడంతో పాటు భూమిలో సారం పెరుగుతుందని, చీడ పీడల బెడద తక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు. పంట మార్పిడికి సంబంధించి సూచనలు, సలహాలు ఆయన మాటలల్లోనే...

**ఇలా చేసుకోవచ్చు..**

యాసంగిలో వేరుశనగ వేసుకునే రైతులు తర్వాత వచ్చే వానాకాలంలో మొక్కజొన్న పంట వేసుకుంటే పైరుకు కొంత నత్రజని లభిస్తుంది. దీంతో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించొచ్చు. కంది, శనగ పైర్లను వరుసగా వేస్తే కాయ తొలుచు పురుగుల తాకిడి అధికంగా ఉంటుంది. అందుకే ఈ పురుగులు తక్కువగా ఆశించే జొన్న, సోయాచిక్కుడు, నువ్వులు, మినుము, ఉలవ, మొట్ట వరి వంటి పంటలతో మార్పిడి చేసుకోవాలి. వరితో పంట మార్పిడి చేసుకుంటే వేరుశనగ పైరుకు నులిపురుగుల బెడద తగ్గుతుంది. వరుసగా పొద్దుతిరుగుడు పంటను సాగు చేసే వారు కొర్ర, జొన్న, సజ్జ చిరు ధాన్యాపు పంటలను లేదా కంది, శనగ, మినుము వంటి అపరాల పైర్లు లేదా వేరుశనగతో పంట మార్పిడి చేసుకోవచ్చు. వంగ తోట వేసిన రైతులు కాలీ ఫ్లవర్‌తో పంట మార్పిడి చేసుకుంటే వంగకు ఎండు తెగులు సోకదు.

**ధాన్యం పంటలతో..**

దోస, కాకర, గుమ్మడి, పొట్ల, బీర, బూడిద గుమ్మడి, దొండ వంటి తీగ జాతి కూరగాయల పంటలను వరి పైరుతో పంట మార్పిడి చేసుకోవాలి. ఉల్లిసాగు చేసే వారు ధాన్యపు పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. ఒకసారి పసుపు సాగు చేసిన వారు రెండేళ్లపాటు భూమిలో పసుపు సాగు చేయకూడదు. ఒక వేళ చేస్తే దిగుబడి తగ్గుతుంది. చీడపీడల బెడద పెరుగుతుంది. వరి, చెరుకు, అరటి, తమలపాకు, కూరగాయల పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. పసుపు తర్వాత వరి, జొన్న వేసుకుంటే నులిపురుగుల ఉధృతి తగ్గుతుంది. మిరప, వేరుశనగ, క్యాబేజీ, పంటల్ని ఆశించే లద్దె పురుగు తాకిడి అరికట్టాలంటే జొన్న, వరి, సజ్జ, రాగి, పొద్దుతిరుగుడు ఆరుతడి పంటలతో మార్పిడి చేయాలి.

**ఇలా చేయొద్దు...**

పంట మార్పిడి చేసే సమయాల్లో అనుకూలమైన పంటనే ఎంచుకోవాలి. లేదంటే చీడ పీడల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. బెండ తర్వాత పత్తి వేస్తే ఉపయోగం ఉండదు. ఎందుకంటే ఈ రెండు పంటలకు ఒకే రకమైన చీడపీడలు ఆశిస్తాయి. జొన్న వేసిన పొలాల్లో మిరప వేయకూడదు. పసుపు తర్వాత మిరప, టమాటా, క్యాబేజీ, దోస, గుమ్మడి, సోర, బీర, పత్తి, ఆవాలు, బెండ వేసుకోకూడదు.

**ఎంపికలో జాగ్రత్తలు..**

పంట మార్పిడి చేయాలంటే అంతకు ముందు వేసిన పంటకు భిన్నంగా పెరిగే పైరును ఎంచుకోవాలి. కొన్ని పంటల వేరు వ్యవస్థలు నేలలోని పొరల నుంచి పోషకాలన్నీ ఎక్కువగా గ్రహిస్తాయి. కాబట్టి పోషకాలన్నీ ఎక్కువగా గ్రహించే నువ్వులు, పొద్దు తిరుగుడు, మొక్కజొన్న పంటలకు బదులుగా భూమికి పోషకాలను గ్రహించే సమకూర్చే అపరాల పంటలతో పంట మార్పిడి చేసుకుంటే ఫలితం ఉంటుంది. అపరాల పంటలు కరువు పరిస్థితులను తట్టుకుంటాయి. ఆకుల్ని రాల్చి భూమికి సేంద్రియ పదార్థాన్ని అందిస్తాయి. అపరాల పైరుల మీద ఉండే బుడిపెలు వాతావరణంలోని నత్రజనిని స్థిరీకరిస్తాయి. సూక్ష్మజీవుల చర్యతో ఎంజైముల ఉత్పత్తి పెరుగుతుంది. నల్లరేగడి నేలల్లో సోయ చిక్కుడు వేసుకుంటే పైరు కోత సమయానికి ఆకులు పూర్తిగా రాలుతాయి. తద్వారా ఎకరానికి ఒకటి నుంచి రెండు టన్నుల సేంద్రియ పదార్థం లభిస్తుంది.

# భళా.. చిన్నారుల నాట్యకళ



- సంప్రదాయ నాట్యంపై చిన్నారుల మక్కువ
- తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ముందుకు
- ప్రతిభ చాటుతూ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు
- పలు ప్రదర్శనల్లో నిర్మల్ చిన్నారులు

నిర్మల్‌ఖిల్లా: పిల్లలను చదువుల యంత్రాలుగా చూస్తున్న కాలం ఇది. రోజూ బండెడు పుస్తకాలు మోస్తూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు అని పిల్లలపై భరించలేని ఒత్తిడిమోపే ఈ కాలంలో నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన పలువురు చిన్నారులు చదువుతో పాటు సంప్రదాయ నృత్యంలో రాణిస్తున్నారు. వారి అభిరుచిని గమనించిన తల్లిదండ్రులు ఆ దిశగా వారిని ప్రోత్సహిస్తున్నారు. ఫలితంగా వారు రాష్ట్ర స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చి అవార్డులు, రివార్డులు సాధిస్తున్నారు. విద్యార్థులు సైతం తమకు నచ్చిన కళలో ఆరితేరేందుకు కృషి చేస్తున్నారు. వివిధ వేదికలపై తమ అభినయంతో ఆకట్టుకుంటున్న పలువురు చిన్నారులపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.


నాట్యనంది పురస్కారం స్వీకరిస్తున్న చిన్నారి సంగారి ఆరాధ్య

**కూచిపూడిలో నాట్యనంది..**

నిర్మల్ పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన చిన్నారులు దాయత్రి సహస్ర, సంగారి ఆరాధ్య కూచిపూడిలో రాణిస్తున్నారు. ×దాయత్రి సహస్ర× ప్రస్తుతం మూడో తరగతి పూర్తయింది. స్థానిక ఎస్వీఎస్ పాఠశాలలో చదువుతున్న 9 ఏళ్ల ఈ చిన్నారి తల్లిదండ్రులు దాయత్రి సుహాసిని-కిషోర్ కుమార్ కూతుర్ని కూచిపూడిలో శిక్షణ ఇప్పిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఇదే కాలనీకి చెందిన సంగారి ఆరాధ్య స్థానిక సెయింట్ థామస్ పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. వీరి తల్లిదండ్రులు స్వరూప -శ్రీనివాస్‌లు చిన్నారికి ఇష్టమైన కళ అయిన నృత్యంలో శిక్షణ ఇప్పిస్తూ ప్రోత్సహిస్తున్నారు. వీరు హైదరాబాద్లోని త్యాగరాయ గానసభలో శిఖరం ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సంప్రదాయ నృత్య పోటీలలో ఈ ఇద్దరు చిన్నారులు ప్రతిభ కనబరిచారు. శివోహం పేరిట నిర్వహించిన ఈ ప్రదర్శనలో చిన్నారులు తమప్రతిభతో ×నాట్య నంది× పురస్కారాన్ని కైవసం చేసుకున్నారు.

**స్వరూపిణి డ్యాన్స్ అకాడమిలో శిక్షణ...**

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే చిన్నారులు కూచిపూడిలో రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందుతున్నారు. విద్యార్థులకు శాస్త్రీయ నిత్యం పై అవగాహన పెంచేందుకు కనుమరుగవుతున్న సంప్రదాయ నృత్యాలకు మళ్లీ పునరుజ్జీవం పోసేందుకు చిన్నారులకు, యువతులకు శిక్షణ ఇస్తున్నారు నవ్య. స్వరూపిణి డ్యాన్స్ శిక్షణ పేరిట నిర్వహిస్తున్న ఈ శిక్షణ శిబిరంలో ఎంతోమంది చిన్నారులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి అనేక పురస్కారాలను అందుకున్నారు.

**కూచిపూడిలో అక్కాచెల్లెళ్లు..**

జిల్లా కేంద్రానికి చెందిన యాతాలం స్వప్న-చిన్నారెడ్డి దంపతులకు ఇద్దరు కుమార్తెలు చిన్న కూతురు ఆద్య మూడో తరగతి పూర్తికాగా పెద్ద కూతురు దీక్షిత తొమ్మిదో తరగతి పూర్తయింది. వీరిద్దరూ స్థానిక వాసవి హైస్కూల్‌లో చదువుతున్నారు. వీరికి కూచిపూడి నృత్యం అంటే చిన్నప్పటి నుంచి మక్కువ. గమనించిన వీరి తల్లిదండ్రులు ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఇటీవల రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో కీర్తి ఆర్ట్స్ అకాడమీ, శిఖరం ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో అక్కాచెల్లెళ్లు ×డాన్స్ ఆఫ్ ఎక్సలెన్స్× అవార్డును సొంతం చేసుకున్నారు. చిన్నప్పటి నుంచే ఈ చిన్నారులు చదువుతో పాటు, నాట్యకళలో ఉత్తమ ప్రతిభను చూపడం పట్ల వీరి కుటుంబ సభ్యులతో పాటు పలువురు వీరిని అభినందిస్తున్నారు.

### 13 న ఓపెన్ ఇంటర్ ఎకనామిక్స్ పరీక్ష

మంచిర్యాలఅర్బన్: ఈ నెల 13 ఓపెన్ ఇంటర్ ఎకనామిక్స్ తెలుగు మీడియం పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2న తెలుగు మీడియంకు బదులుగా ఇంగ్లిష్ మీడియం పేపర్ రావడంతో పరీక్ష వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు. తిరిగి 13న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గతంలో రాసిన కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో తెలిపారు.

## ఎన్‌హెచ్ 63 బాధితుల దీక్ష కొనసాగింపు


సంఘీభావం తెలుపుతున్న డీసీసీ అధ్యక్షురాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల -ఆర్మూర్ నాలుగు వరుసల జాతీయ రహదారి 63 బాధితుల దీక్ష కొనసాగుతోంది. వేంపల్లి-ముల్కల్ల శివారులో దీక్షా శిబిరం ఏర్పాటు చేసి న్యాయం కోసం పోరు సాగిస్తున్నారు. రహదారి విస్తరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా, తమ అనుమతులు లేకుండా మా భూముల్లో సర్వే ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు.డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ బుధవారం దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. రైతుబంధు సమితి మండల కన్వీనర్ పూస్కూరి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ బొడ్డు శంకర్, నాతరి శ్రీనివాస్ ఎంపీ వెంకటేశ్‌నేతను కలిసి వినతిపత్రం అందజేశారు.